సైకిల్‌ట్రాక్‌లోకి దూసుకెళ్లిన కారు

- ట్రాక్‌పై ఎవరూ లేకపోవటంతో తప్పిన ప్రమాదం
- కారు వదిలిపెట్టి డ్రైవర్ పరార్



అదుపు తప్పి సర్వీసు రోడ్డు నుంచి సైకిల్ ట్రాక్ దాటి వచ్చిన కారు



సోలార్ ఫ్యానల్ పిల్లర్‌ను సరిచేస్తున్న సిబ్బంది

మణికొండ: ఔటర్ రింగ్ రోడ్డు, సర్వీసు రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన సైకిల్ ట్రాక్‌లోకి ఓ ఇన్నోవా కారు అదుపు తప్పి శనివారం ఉదయం దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. నానక్‌రాంగూడ సర్కిల్ నుంచి నార్సింగి వైపు వస్తున్న ఇన్నోవా కారు అశోకా లివియానా టవర్ వద్దకు రాగానే అదుపు తప్పి సైకిల్ ట్రాక్‌కు పై కప్పుగా వేసిన సోలార్ ప్యానల్ స్తంభాన్ని ఢీకొట్టి సైకిల్ ట్రాక్ దాటి అటు వైపు దూసుకెళ్లింది. ఆ సమయంలో కారులో డ్రైవర్ మాత్రమే ఉండటంతో కారును వదిలి పారిపోయాడు. ఉదయం సమయంలో పిల్లలతో పాటు పెద్దలు సైకిల్ తొక్కేందుకు వస్తుంటారు. కారు అదుపు తప్పిన సమయంలో ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. ఔటర్ సర్వీసు రోడ్డు ఎత్తులోనే సైకిల్ ట్రాక్ ఉండటం, సరైనా బారికేడ్ల వ్యవస్థను సైతం ఏర్పాటు చేయకపోవటంతో కార్లు దూసుకు వెళ్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. గతంలోనూ ఇదే చోట ఓ కారు ఇదే తరహాలో అదుపు తప్పిందని వివరించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి సైకిల్ ట్రాక్‌లోకి వాహనాలు వెళ్లకుండా భారీ భారీకేడ్‌లను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని వారు కోరుతున్నారు. కారు ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని నార్సింగి అడ్మిన్ ఎస్సై సుఖేందర్‌రెడ్డి తెలిపారు.

యువత ఆవిష్కరణలను ప్రోత్సహించాలి

నీతి అయోగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ వీ.కే సరస్వత్

శంషాబాద్: వినూత్న ఆవిష్కరణలను చేపడుతున్న యువతరాన్ని ప్రోత్సహించేందుకు అనేక వేదికలు అవసరమని నీతి అయోగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ వీ.కే సరస్వత్ అన్నారు. ఫెయిల్యూర్ అనాలసిస్ ఇన్ మెటలర్జికల్ ఇండస్ట్రీపై ఎస్ఎఫ్ఏ ఆధ్వర్యంలో నోవాటెల్‌లో జరిగిన ముగింపు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో వైఫల్యాలను గుర్తిస్తే భారీ ఆర్థిక నష్టాలను నివారించేందుకు మార్గం సుగమమవుతుందన్నారు. వైఫల్యాలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకుంటేనే విజయాలకు దారి దొరుకుతుందన్నారు. క్షేత్రస్థాయిలో కొత్త ఆవిష్కరణలు చేపడుతున్న వారికి ప్రభుత్వాలు అండగా ఉంటాయన్నారు. మెటలర్జికల్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న వైఫల్యాలపై ఏళ్లుగా ఎస్ఎఫ్ఏ వేదికగా మార్గాలను అన్వేషిస్తూ.. ముందుకెళ్తున్నట్లు మిథాని సంస్థ ఎండీ, ఎస్ఎఫ్ఏ అధ్యక్షుడు ఎస్.కే ఝా, ఎస్ఎఫ్ఏ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

సాంకేతిక పరిశోధనలతో

విద్యార్థుల్లో ప్రతిభ మెరుగు

బండ్లగూడ: సైన్స్ ఫెయిర్స్ నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక, పరిశోధనల పట్ల చిన్ననాటి నుంచే ఆసక్తి పెరుగుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని న్యూలిటిల్ స్కాలర్స్ స్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు కూడా తమ పరిశోధనలతో మానవాళి అభివృద్ధికి పాటుపడేలా కష్టపడాలని సూచించారు. అత్యంత పేద కుటుంబంలో పుట్టి చాలా కష్టపడి చదువుకుని, మిస్సైల్ మ్యాన్‌గా ఎదిగి, ఆ తరువాత ఈ దేశానికి రాష్ట్రపతి అయిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మనందరికి స్ఫూర్తిదాయకమన్నారు. శంషాబాద్ మున్సిపల్ చైర్మన్ సుష్మామహేందర్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రీలతసురేష్‌గౌడ్, సాగర్‌గౌడ్, ఎంఈఓ రామ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కోకాపేట్‌లో మల్లన్న జాతర

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట్‌లో ఆదివారం శ్రీ భ్రమరాంబక్యాతమ్మ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. ఉత్సవాల్లో ఉదయం 9.45 గంటలకు గంపలతో ఊరేగింపు, 10.30గంటలకు స్వామి జీవిత ఒగ్గుకథ, 11.52 గంటలకు కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5గంటలకు అగ్నిగుండాలు, 5.30 గంటలకు గొలుసులు తెంపుట ఉంటాయన్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

ఆర్టీసీ ప్రయాణికుల పాట్లు !



ఆరాంఘర్ చౌరస్తాలో..

రాజేంద్రనగర్: పూర్తిస్థాయిలో ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అసలే మహిళలకు ఉచిత ప్రయాణం కావడంతో జనం బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణం చేస్తున్నారు. ఇక మేడారం జాతరకు అదనపు బస్సులు నడపడంతో సరిపడ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆరాంఘర్ చౌరస్తాలో శనివారం ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికులు ఎదురు చూస్తూ కనిపించారు.

పెళ్లికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

– ఆభరణాలు, దస్తావేజులు ఎత్తుకెళ్లిన దుండగులు

రాజేంద్రనగర్: పెళ్లికి వెళ్లి వచ్చేసరికే ఇంట్లో దొంగలు పడి బంగారు ఆభరణాలతో పాటు విలువైన దస్తావేజులను దొంగిలించిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన అనిల్ (38) తన బంధువుల ఇంట్లో వివాహం ఉండడంతో ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి నాగర్‌కర్నూల్‌కు వెళ్లాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో దొంగలు పడి రెండు తులాల బంగారు ఆభరణాలతో పాటు ఇంటికి సంబంధించిన దస్తావేజులను ఎత్తుకెళ్లారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అనిల్ నాగర్‌కర్నూల్ నుంచి వచ్చి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

బండ్లగూడ: ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరడంతో శనివారం జలమండలి జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి పర్యటించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అభ్యుదయనగర్ కాలనీలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతుందని స్థానిక నాయకుడు నరేందర్‌బాబు జలమండలి అధికారులకు రెండు వారాల క్రితం సమస్యను వివరించారు. అధికారులు స్పందించకపోవడంతో శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జలమండలి జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో శనివారం జలమండలి అధికారులు అభ్యుదయనగర్ కాలనీలో పర్యటించారు. గతంలో వాటర్ వాల్వ్ ద్వారా నీటిని ఒక ప్రణాళిక ప్రకారం అందించారని, ఏడాది క్రితం నూతన వాటర్ పైపులైన్లు వేసినప్పుడు వాల్వ్‌లను తీసేసి గ్రావిటేషన్ పద్ధతిలో నీరు అందిస్తామన్నారు. సమస్య ఉత్పన్నం కాకుండా చూస్తామని అధికారులకు తెలిపిన నీటి సరఫరా కాకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మేరకు సమస్యను పరిశీలించి త్వరలో శాశ్వత పరిష్కారం చూపిస్తామని జలమండలి మేనేజర్ హామీ ఇచ్చారన్నారు. నరేందర్‌బాబు, బాబులాల్, రవిశంకర్, చంద్రశేఖర్, లోకేష్, కృష్ణప్రసాద్, వెంకట్, మార్క్, రాములు తదితరులున్నారు.



అభ్యుదయనగర్ కాలనీలో పర్యటిస్తున్న జలమండలి మేనేజర్ రవీందర్‌రెడ్డి

నాడు 'త్రిబుల్ ఎక్స్'.. నేడు బీజేఎంసీ



నాడు త్రిబుల్ ఎక్స్‌గా ఉన్న నూతన కార్పొరేషన్ కార్యాలయ భవనం (ఫైల్)

బండ్లగూడ: సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వచ్చిన వ్యతిరేకతకు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించారు. కిస్మత్‌పూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న కార్పొరేషన్ భవనానికి అధికారులు నామమాత్రంగా వెలువేషన్‌కు త్రీబుల్ ఎక్స్ అని పెట్టి పనులను నిర్వహిస్తున్నారు. దీనిని చూసిన స్థానిక యువకులు అయోమయానికి గురైయ్యారు. ఇదే విషయమై కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారం కొనసాగింది. కార్పొరేషన్ అధికారులను పలువురు ట్రోల్స్ చేస్తూ.. పోస్టులను వేశారు. ఈ మేరకు ఓంనగర్ కాలనీ అధ్యక్షుడు నవీన్ కార్పొరేషన్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఈ విషయమై చర్చించి పేరు మార్చాలని వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ అస్తవ్యస్తంగా ఉన్న పేరును తొలగించి బీజేఎంసీగా పేరు మార్చి పనులను నిర్వహిస్తున్నారు. కార్పొరేషన్ కార్యాలయ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయని త్వరలోనే ప్రారంభానికి సిద్ధం అవుతుందని సమాచారం.



నేడు బీజేఎంసీగా పేరు మార్చి పనులను నిర్వహిస్తున్న దృశ్యం

హోటల్ భోజనంలో ఈగ.. జరిమానా విధింపు



హోటల్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపాలిటీ హెల్త్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య తదితరులు

- వినియోగదారుడి ఫిర్యాదుతో తనిఖీలు
- బయటపడ్డ కుళ్లిపోయిన ఆహారపదార్థాలు
- రూ. 5 వేల జరిమానా విధించిన మున్సిపల్ అధికారులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని హోటళ్ల తీరుతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. తాజాగా మరో హోటల్ వినియోగదారుడు తాను తింటున్న ఆహారంలో ఈగ రావడంతో శంషాబాద్ మున్సిపాలిటీ అధికారులు దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో అధికారులు హోటల్‌ను తనిఖీ చేయగా.. అక్కడున్న పదార్థాలు చూసి ముక్కుమూసుకున్నారు. పట్టణంలోని తొండుపల్లి జాతీయ రహదారి పక్కనే ఉన్న శాకాహారానికి సంబంధించిన ఓ హోటల్‌లో తాను తీసుకున్న ఆహారంలో ఈగ రావడంతో హోటల్ యజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. మున్సిపాలిటీ హెల్త్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో హోటల్‌లోని వంట గదులను పరిశీలించగా.. నాణ్యతలేని ఆహారం, పాచిపోయిన పదార్థాలు ఉండటంతో హోటల్‌కు రూ. 5 వేల జరిమానా విధించారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. పట్టణంలోని అనేక హోటళ్లలో ఇటీవల ఓ వినియోగదారుడు ఆహారం తిని అస్వస్థకు గురైనట్లు ఫిర్యాదు చేశాడు. ఓ బిర్యానీ హోటల్‌లో బొద్దిక వచ్చిన ఘటనపై కూడా అధికారులకు ఫిర్యాదులు అందినట్టు సమాచారం. హోటళ్ల తనిఖీలను నిరంతర ప్రక్రియ కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు.

పైప్‌లైన్ పగలడంతో నీటి సరఫరా బంద్

మణికొండ: నెలరోజుల వ్యవధిలోనే మూడుసార్లు పైప్‌లైన్ పగలడం, నీటి సరఫరా నిలిచిపోవటంతో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగూరు నుంచి ఖానాపూర్ రిజర్వాయర్‌కు నీటి సరఫరా జరిగే 1200 ఎంఎం డయా పైపులైన్ బుల్కాపూర్ వద్ద శుక్రవారం ఉదయం పగిలిపోయింది. దీంతో జంట మున్సిపాలిటీల పరిధిలో శుక్రవారం, శనివారం జరగాల్సిన నీటి సరఫరా నిలిచిపోగా.. ప్రజలు తాగునీటితో పాటు వాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుందామన్నా జలమండలి రిజర్వాయర్లలో సైతం నీరు ఉండకపోవటంతో అవీ లభించడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తే ఒక్కో ట్యాంకర్‌కు రూ. 900ల నుంచి రూ. 1200ల వరకు వసూలు చేస్తున్నారని వాపోయారు. జలమండలి అధికారులు లీకేజీలను గుర్తించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. శనివారం రాత్రికి మరమ్మతులు పూర్తైతే ఆదివారం కొన్ని కాలనీలకు నీటిని సరఫరా చేస్తామని జలమండలి సిబ్బంది తెలిపారు.

మహావీర్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

అత్తాపూర్: విద్యార్థులు కష్టపడి చదివితే తమ లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టిక్నాలజీ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో గ్లోబల్–లాజిగ్ సంస్థ ఉద్యోగ నియామకాలు నిర్వహించారు. కళాశాలకు చెందిన వివిధ బ్రాంచీల 4వ సంవత్సరం విద్యార్థులకు మొత్తం 22 మందిని ఎంపిక చేసి ఉద్యోగ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యార్థులకు ఉత్తమ విద్యాబుద్ధులు నేర్పిస్తామన్నారు. మౌలిక వసతులను ఉపయోగించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులకు అభినందించారు. కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ ఎం.సుబ్బారెడ్డి, డాక్టర్ నందగోపాల్‌రెడ్డి, మృదుల తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సత్కారం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ తహశీల్దార్ రాములును శనివారం మాజీ వార్డు సభ్యుడు గుంటి నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఎమ్మార్పీఎస్ కార్యదర్శి గుంటి రమేష్, బెంజిమెన్, పవన్‌కుమార్ తదితరులున్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల పరిశీలన

శంషాబాద్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'అమృత్ భారత్ స్టేషన్' పథకంలో భాగంగా పట్టణంలోని ఉందానగర్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను బీజేపీ నాయకులు పరిశీలించారు. ఇప్పటికే ప్లాట్ ఫాంలు, స్టేషన్ భవనాన్ని ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 26 ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా చేపడుతున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. బీజేపీ నేతలు డాక్టర్ ప్రేమ్ రాజ్, పట్టణ అధ్యక్షుడు దేవేందర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తదితరులున్నారు.

ఎస్ఎఫ్ఏలకు సన్మానం

రాజేంద్రనగర్: ఓపెన్ పాయింట్లలో చెత్త వేయకుండా నిర్మూలించిన 12 మంది ఎస్ఎఫ్ఏలకు శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో మేయర్‌తో పాటు కమిషనర్ అభినందించి సన్మానించారని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. అత్తాపూర్, సులేమాన్‌నగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం డివిజన్లలోని 28 పాయింట్లలో 12 మంది ఎస్ఎఫ్ఏలు ఓపెన్ పాయింట్లను గుర్తించి వాటిని నిర్మూలించారన్నారు. స్థానికులకు అవగాహన కల్పిస్తూ.. ఓపెన్ పాయింట్లలో చెత్త ఎవరూ వేయకుండా తగిన చర్యలు చేపట్టారన్నారు. సర్కిల్‌లో మొత్తం 115 ఓపెన్ పాయింట్లు ఉన్నాయని, దశల వారీగా వాటన్నింటిని స్థానిక ప్రజల సహకారంతో నిర్మూలిస్తామని వారు సహకరించాలని కోరారు.

జోరుగా సమ్మక్క, సారలమ్మ జాతర

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మానసహిల్స్ సమ్మక్క సారలమ్మ గుట్టపై శనివారం రెండోరోజు జాతర జోరుగా సాగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు బంగారాన్ని సమర్పిస్తూ.. మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లీగల్ ఒపీనియన్‌తో బడ్జెట్ పాస్



మాట్లాడుతున్న మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అభివృద్ధి కార్యక్రమాల కల్పనకు ఎప్పటికప్పుడు నిధులు కేటాయించుకుంటూ ముందుకెళ్తున్నామని మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. కార్పొరేషన్ కార్యాలయంలో 2024–25 సంవత్సరానికి సంబంధించిన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. నిర్వహణ, వివిధ అభివృద్ధి పనులకు రూ.64.12 కోట్లతో అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అంచనా ఆదాయం వివరాలు ఇలా ఉన్నాయి. పన్ను ఆదాయం రూ.3001.00 లక్షలు, అద్దె/పెనాలిటీ ఆదాయం రూ.142.78 లక్షలు, ట్రేడ్ లైసెన్స్/పెనాలిటీల ఆదాయం రూ.51.50 లక్షలు, టౌన్‌ప్లానింగ్ ఆదాయం రూ.2200.00 లక్షలు, ఇంజినీరింగ్ విభాగం ఆదాయం రూ.10.00 లక్షలు, డిపాజిట్స్ ఆదాయం రూ.125.78 లక్షలు, నాన్‌ప్లాన్ గ్రాంట్లు రూ.225.96 లక్షలు, ప్లాన్ గ్రాంట్ రూ.10.00 లక్షలు, ఇతర గ్రాంట్లు రూ.40 లక్షలు, అంచనా ప్రారంభపు విలువ రూ.605.06గా అంచనా వేస్తున్నారు. మొత్తం రూ.6412.08 లక్షల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

లీగల్ ఒపీనియన్ ద్వారా బడ్జెట్ పాస్...

కార్పొరేషన్ పరిధిలో మొత్తం 22 డివిజన్‌లు ఉన్నాయి. ఒక కార్పొరేటర్ మృతి చెందడంతో 21 మంది మాత్రమే ఉన్నారు. ఫోరంలో 3/4 ఉంటే సమావేశాన్ని ఏర్పాటు చేసి తీర్మానాన్ని చెప్పుకునే అవకాశం ఉంటుంది. ఈ మేరకు కార్పొరేషన్ మేయర్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో 3/1 వంతు సభ్యులు 7 మంది హాజరుకావడంతో సమావేశమై బడ్జెట్‌ను ఆమోదించామన్నారు.

అక్రమ సెల్లార్ పనులను నిలిపివేయాలి

శంషాబాద్: పట్టణంలోని దోసికుంట సమీపంలో భారీ ఎత్తున జరుగుతున్న అక్రమ సెల్లార్ పనులను వెంటనే నిలిపేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కుంటనీరు సెల్లార్‌లోకి వస్తున్నా.. పనులు యధాతథంగా కొనసాగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ నేతల ప్రోత్సాహంతో జరుగుతున్న అక్రమ సెల్లార్‌పై గతంలో ఫిర్యాదు చేసినా.. పట్టించుకోలేదని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, పనులను ఆపకపోతే సీఎం దృష్టికి సైతం తీసుకెళ్తామని చెప్పారు. పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జిల్లపల్లి నరేందర్, నాయకులు బొబ్బిలి కిష్టయ్య, మంచాల గణేష్, వెంకటేష్, బాబుయాదవ్, సుధాకర్‌రెడ్డి, బండి అర్జున్, జయమ్మ, భాస్కర్‌రెడ్డి, భాషా, దత్తు, పెంటయ్య, శేఖర్, అభిషేక్‌యాదవ్, ఇమ్రాన్, రాహుల్, అంకిత్ పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

స్వచ్ఛతపై పారిశుద్ధ్య సిబ్బందికి అవగాహన



మాట్లాడుతున్న డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: ప్రజలు రోడ్లపై చెత్త చెదారాన్ని వేయకుండా ఇంటి వద్దకు వచ్చే ఆటోలకు అందజేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ సూచించారు. శనివారం రవికుమార్ ఆధ్వర్యంలో వివిధ బస్తీల్లో నెలకొన్న పారిశుద్ధ్య కార్యక్రమాలపై పారిశుద్ధ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించి పరిశుభ్రమైన పరిసరాలను కలిగి ఉండాలన్నారు. ఆటోలు విధిగా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేసి వ్యర్థాలను ప్రభుత్వం సూచించిన పాయింట్‌లో మాత్రమే వేయాలన్నారు. తడి, పొడి చెత్త కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల ద్వారా ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తున్నామన్నారు. శానిటేషన్ డీఈ శ్రీనివాస్, డీపీఓ సుధారాణి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎన్.ధనుంజయ, జిల్లా ఉపాధ్యక్షులు కోరని బాల్‌రాజ్, శాస్త్రిపురం డివిజన్ అధ్యక్షులు తాజుద్దీన్, సులేమాన్‌నగర్ అధ్యక్షులు ఇస్మాయిల్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్‌రెడ్డి, గురుకుమార్, సదానంద్, స్వచ్ఛంద సేవకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండొద్దు

మణికొండ: వినియోగానికి అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి సంపూర్ణంగా ఉందని, సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఇబ్రహీంబాగ్ డీఈ శివశంకర్ ఆదేశించారు. శనివారం ఆయన ఇబ్రహీంబాగ్ ఏడీ కార్యాలయంలో నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలోని అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి వినియోగదారునికి నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. సరఫరాలో అంతరాయం కలిగితే వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ వినియోగదారులకు నూతన టెక్నాలజీతో ఇంటింటికీ బిల్లులు వచ్చేలా సిబ్బంది పనిచేయాలన్నారు. విద్యుత్‌శాఖకు సకాలంలో పూర్తి బిల్లులను వసూలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఏడీ అంబేడ్కర్, ఏఈలు సందీప్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ డీఈ శివశంకర్

మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



హైదర్షాకోట్‌లో చీరలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పుష్ప

బండ్లగూడ: పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో గొప్పవని వారు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తారని బండ్లగూడ కార్పొరేషన్ కార్పొరేటర్ పుష్పశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదర్షాకోట్‌లోని పారిశుద్ధ్య కార్మికులకు శనివారం ఆమె చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం తమ విధుల్లో భాగంగా పరిసరాల పరిశుభ్రత కోసం వారు ఎంతో శ్రమిస్తారన్నారు. తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా చెత్త చెదారాల్లో పనిచేస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతుంటారన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను ప్రతి ఒక్కరు గుర్తించాలని సూచించారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే తాను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు టింకురెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



మణికొండ మున్సిపల్ కమిషనర్‌ను సన్మానించిన కాంగ్రెస్ నేతలు

మణికొండ: మణికొండ మున్సిపల్ కమిషనర్‌గా నియమితులై పదవీ బాధ్యతలు తీసుకున్న ప్రదీప్‌కుమార్‌ను మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు శనివారం సన్మానించారు. గోవా క్యాంప్ నుంచి వచ్చిన వారు ఆయనను కలిసి తమ మున్సిపాలిటీ, వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కౌన్సిలర్లు మీనముత్యాలు, జ్యోతి మల్లేష్, లక్ష్మీనారాయణ, ఎస్.శ్వేతకిరణ్‌కుమార్, పురుషోత్తం, కో–ఆప్షన్ సభ్యురాలు అజీమున్నిసా జహంగీర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జితేందర్ పాల్గొన్నారు.

మాఘ పౌర్ణమి ప్రత్యేక పూజలు



శివాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు

మణికొండ: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం మణికొండ పార్వతీరామలింగేశ్వరాలయంలో శ్రీలలితా సమాఖ్య ఆధ్వర్యంలో సౌందర్య లహరి, శ్రీలలితా సహస్ర నామ పారాయణం నిర్వహించారు. శ్రీలలితా సమాఖ్య అధ్యక్షురాలు రంగమణి శ్రీలలితాదేవి చిత్రపటాన్ని అలంకరించి దీపారాధన చేశారు. అనంతరం శ్రీ శంకరాచార్య విరచిత సౌందర్య లహరి, లలితా సహస్రనామ పారాయణం సామూహికంగా నిర్వహించారు. శివానంద లహరిలోని కొంత భాగాన్ని పారాయణం చేశారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. భవాని, యశోదా, పద్మావతి, విజిత, ప్రసూన, ఉషలతో పాటు మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి గోల్డెన్ టెంపుల్ అష్టాదశ వార్షికోత్సవాలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, సెక్రటేరియట్ కాలనీ పరిధిలోని శ్రీ శారదా చంద్రమౌళీశ్వర, వేంకటేశ్వరస్వామి దేవాలయం(గోల్డెన్‌టెంపుల్) అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం నుంచి మంగళవారం వరకు నిర్వహిస్తున్నట్లు శృంగేరి శారదాపీఠం గౌరవ ప్రతినిధి కశ్యప్ చతుర్వేది తెలిపారు. ఆదివారం ఉదయం 7గంటలకు గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 8 గంటలకు శ్రీ శారదాంబ అష్టోత్తర శత కలశాభిషేకం, ఉదయం 10 గంటలకు సూర్యనమస్కారాలు, చండీపారాయణం, సాయంత్రం 4 గంటలకు గణపతిహోమం, రుద్రహోమం, చండీహోమం, సాయంత్రం 6 గంటలకు శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దివ్య కల్యాణోత్సవం, ధ్వజారోహనం, ఊంజల్‌సేవలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు. సోమవారం ఉదయం శ్రీ కామేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణం, సాయంత్రం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం, మంగళవారం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి అష్టోత్తర శత కలశాభిషేకం ఉత్సవాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు.